క్లుప్తంగా

పథకాలు పారదర్శకంగా అందించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం పీలేరులోని ఐదు సచివాలయాల గ్రామ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్లు వారధులుగా ఉండి, ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా చూడాలన్నారు. సమస్యలను గుర్తించి, అధికారుల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు బాధ్యతగా పని చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందని, బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏటీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, కోఆర్డినేటర్ షఫీ, ఏఎంసి చైర్మెన్ కడప గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు చలపతి, హరిత, నాయకులు హుమయూన్, కాలనీ చిన్నా, ఉదయ్, ఆనంద్, ఇబ్రహిం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక కలకడ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కొందరు సిబ్బంది గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని ముష్టూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని ఎంఈఓ రాజగోపాల్ గురువారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భోజన నిర్వాహకులు పకడ్బందీగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సంపూర్ణ పోషణ ఆహారం అందిస్తున్నామన్నారు.


బహుమతుల ప్రదానం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ సవరాల రవిశంకర్, సవరాల క్రిష్ణమూర్తిలు ఎంఈఓ నారాయణ, హెచ్ఎం గౌస్‌పీర్ సమక్షంలో మంజునాథ్, సుప్రియ, రేఖ, అచ్యుతలకు బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

వర్మీ కంపోస్టు యూనిట్లు మంజూరు

కురబలకోట : మండలంలోని ఎనిమిది గ్రామాల్లో రూ.50.56 లక్షలతో వర్మీ కంపోస్టు యూనిట్ల (డంపింగ్ యార్డుల) నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు బైసాని జ్యోతి, ఎంపీపీ బి.దస్తగిరి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నందిరెడ్డిగారిపల్లెకు రూ.6.44 లక్షలు, ఎర్రబల్లెకు 6.44, కనసానివారిపల్లెకు 6.81, వనమరెడ్డిగారిపల్లెకు 6.70, కడప క్రాస్‌కు 6.79, దాదంవారిపల్లెకు 4.45, పిచ్చలవాండ్లపల్లెకు 6.44, చింతమాకులపల్లెకు రూ. 6.49 లక్షలు మంజూరైనట్లు వారు వివరించారు.

రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలి



ఫుట్‌బాల్ జట్టుతో డీవైఈఓ, ఎంఈఓ

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని డీవైఈఓ క్రిష్టప్ప తెలిపారు. ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో పాల్గొనేందుకు జిల్లా బాలురు, బాలికల జట్ల క్రీడాకారులు గురువారం వెళ్లారు. అంతకుముందు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలోఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం రెడ్డన్నశెట్టి, పీడీలు అన్సర్, సుధాకర్, కోచ్‌లు విజయ, సరస్వతి పాల్గొన్నారు. క్రీడాకారులకు బిసెంట్ సాకర్ క్లబ్ జెర్సీలను అందజేశారు.

గడప గడపలో సంక్షేమం

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 30వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలతో గడప గడపలో సంక్షేమం కనిపిస్తోందని, ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 30వ వార్డులో కౌన్సిలర్ సరిత ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జింకా చలపతి, నూర్ ఆజం, కౌన్సిలర్ సరిత, బాలగంగాధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. పథకాల మంజూరులో తాము రాజకీయాలు చేయబోమని, కులాలు, మతాలు చూడబోమని, అర్హత ఉంటే చాలు పథకాలు నేరుగా ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు. అర్హులుగా ఉండి నేటికీ పథకాలు అందనివారు మధ్యవర్తులు, దళారులతో ప్రమేయం లేకుండా ధృవీకరణ పత్రాలతో నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలను కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని వారి అవసరాలను తీరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమం కనపడటం లేదని, కేవలం అధికారం కోసమే రాజకీయాలు అన్నట్లుగా బతుకుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌కు బుద్ధిచెప్పి మరోసారి సీఎంగా జగనన్ననే గెలిపించుకుందామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపి 175కి 175 స్థానాల్లోనూ జెండా ఎగురవేసేలా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేస్త్రీ శ్రీనివాసులు, ఈశ్వర్‌నాయక్, ఎస్.కరీముల్లా, సింగిల్ విండో చైర్‌పర్సన్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ శరత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, కోఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, రహీం, పోతబోలు నాగరాజ, ఎల్‌ఐసీ సుధాకర్, సోమశేఖర్‌రెడ్డి, జాన్‌బాబు, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీవెంకటరమణస్వామి ఆలయంలో శనివారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రెడ్డిభాస్కర్ తెలిపారు. స్థానికంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. 21న శనివారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22న ధ్వజారోహణం, పల్లకి ఉత్సవం, 23న శేష వాహనం, హంసవాహనం, 24న ముత్యపు పందిరి వాహనం, సింహ వాహనం, 25న కల్పవృక్ష, హనుమంత వాహనాలపై ఊరేగింపు, 26న సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై స్వామి వారి ఊరేగింపు, 27న సర్వభూపాల వాహనం, రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, గరుడవాహనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 28న రథోత్సవం, గజవాహనం, 29న పల్లకి ఉత్సవం, అశ్వవాహనం, 30న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం, 31న స్నపన తిరుమంజనం, రాత్రి పుష్పయాగం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఇందుకు టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో కనువిందు కలిగేలా ముస్తాబు చేశారు. ప్రతి రోజు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథలు, సంగీతం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

వాల్మీకిపురం : జాతీయ స్థాయి బాస్కెట్ బాల్, నెట్‌బాల్ పోటీలకు వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9 వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తమ కళాశాలలో చదువుతున్న మమత, గాయత్రి పాల్గొని, నేషనల్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో వీరిద్దరూ పాల్గొని, నేషనల్స్‌కు ఎంపికై నట్లు పేర్కొన్నారు. వీరు త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పిడి మురళీధర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేమన జీవితం.. ఆదర్శప్రాయం



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు

మదనపల్లె సిటీ : వేమన జీవితం ఆదర్శప్రాయమని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ద్వారకనాథరెడ్డి, కంభం నాగభూషణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని వైఎస్సాఆర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రభావితం చేసిన మహనీయుడన్నారు. వేమన సాహిత్యం మరింత విస్తృతం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, కోశాధికారి అంకిరెడ్డి, సాంబశివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివరాంరెడ్డి, శేషారెడ్డి, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణమూర్తి, తెలుగు అధ్యాపకుడు రెడ్డిశేఖర్, అధ్యాపకుడు రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లి: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో యోగి వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మూఢనమ్మకాలను నిర్మూలించడానికి యోగివేమన కృషి ఎనలేనిదని, సామాజిక అంశాలపై సామాన్యులకు అవగతమయ్యేలా స్వచ్ఛ తెలుగు కవితలు ఆయన సొంతమని ఏపీ మోడల్ పాఠశాలలో జరిగిన జయంతి ఉత్సవంలో పాల్గొన్న ఎంఈవోరెడ్డిబాషా కొనియాడారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : యోగివేమన జయంతిని పీలేరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ, తెలుగుబాషా సమితీ అధ్యక్షులు మురళీధర్ రాజు, ఉపాధ్యాయులు శ్రీధర్, జగన్మోహన్, క్రిష్ణమూర్తి, మునిరత్న, సీఆర్‌పీలు మాధవి, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో డీఎస్పీ, ఎంవీఐ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మానవ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని డీఎస్పీ కేశప్ప, ఎంవీఐ దినేష్‌చంద్ర అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం మదనపల్లె రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే డ్రైవింగ్ వృత్తిలో కొనసాగాలన్నారు. మద్యం సేవించి బాధ్యతా రాహిత్యంగా వాహనాలు నడిపితే వారు ప్రమాదానికి గురవడంతోపాటు ఎదురుగా వస్తున్న అమాయకులు ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే సమాజం ప్రమాదరహితంగా ఉండటమే కాకుండా అందరూ క్షేమంగా ఉంటారన్నారు. ఆటోల్లో ఓవర్‌లోడింగ్, స్కూల్ విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్లడం, రోడ్డుపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడం, ట్రాఫిక్ సమస్యలు సృష్టించడం చేయవద్దన్నారు. ఎంవీఐ దినేష్‌చంద్ర మాట్లాడుతూ డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రాణాలు చాలా విలువైనవని, డ్రైవింగ్ సమయంలో ప్రతి డ్రైవర్ తన మీద ఓ కుటుంబం, తనను నమ్ముకుని ఆత్మీయులు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం లేదన్నారు. ఏఎంవీఐ శివలింగయ్య మాట్లాడుతూ వాహనాల్లో దేవుడి ఫొటోతోపాటుగా కుటుంబసభ్యుల ఫొటో ఉంచుకోవడం శ్రేయస్కరమన్నారు. తాలూకా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవింగ్ వృత్తి బాధ్యతతో కూడుకున్నదని, దయచేసి విలువైన ప్రాణాలు కాపాడాలని అభ్యర్థించారు. సమావేశంలో ఉప రవాణాశాఖ అధికారి అజయ్‌కుమార్, టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్, నిమ్మనపల్లె ఎస్ఐ ఫాతిమా, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

బి.కొత్తకోట : మండలంలోని కోటావూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ శంకరయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో ప్రజలకు ఉచితంగా అన్ని రకాల ఆధార్ సేవలను అందిస్తారు. రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. కేంద్రంలో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు, సేవల్లో జాప్యం, నిర్లక్ష్యంపై ఆయన పరిశీలించారు. సేవలు పొందడానికి వచ్చిన ప్రజలను విచారణ చేశారు. మెరుగైన సేవలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి షరుద్దీన్ ఉన్నారు.

చౌకదుకాణం పరిశీలన



లబ్ధిదారులను విచారణ చేస్తున్న డీఎస్‌వో రఘునాథరెడ్డి

రామసముద్రం : మండలంలోని మాలేనత్తం గ్రామంలో ఉన్న 21వ చౌకదుకాణాన్ని డీఎస్‌వో రఘునాథరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలేనత్తం చౌకదుకాణం పరిధిలోని సుమారు 58 రేషన్‌కార్డులు పక్క గ్రామంలోని షాప్ నంబర్లు 38 చింపరపల్లె, 22 మూగఎరప్పల్లె గ్రామాల్లోకి చేరిపోయినట్లు లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. తమ గ్రామంలో చౌకదుకాణం ఉన్నప్పటికీ తమ రేషన్‌కార్డులు పక్క గ్రామాలకు బదిలీ కావడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్డులను తమ గ్రామంలోని చౌకదుకాణానికి బదిలీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్‌వో కార్డులను మాలేనత్తంకు బదిలీ చేసేందుకు కలెక్టర్‌కు పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాస్త్రీ, వీఆర్‌వో నాగభూషణమ్మ, డీలర్ చంద్రరెడ్డి పాల్గొన్నారు.

చెరువుల వేలం

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట సచివాలయంలో సర్పంచ్ వై.విజయమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి ఆజాద్ గురువారం చెరువు వేలం పాటలు నిర్వహించారు. మొత్తం ఐదు చెరువులకు వేలం పాటలు నిర్వహించగా రూ.39 వేల ఆదాయం వచ్చింది. పంచాయతీలో అభివృద్ధి పనులకు ఈ నిధులు ఉపయోగిస్తామని కార్యదర్శి వెల్లడించారు.

బాస్ కమిటీ ఎన్నిక

బి.కొత్తకోట: భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) బి.కొత్తకోట పట్టణ అధ్యక్షుడిగా ఎస్.మణిని ఎన్నుకున్నారు. గురువారం పట్టణ కమిటీ ఎన్నికను ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు కేవీ రమణ, మాజీ ఉపాధ్యక్షులు సచిన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా నరేంద్ర, ఓబులేసు, ప్రధాన కార్యదర్శిగా కోగర అంజి, కార్యదర్శిగా నరేష్, ప్రచార కార్యదర్శిగా రెడ్డిశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా పురషోత్తం ఎన్నికయ్యారు.

ఈ-కేవైసీ గడువు పెంపు

పెద్దతిప్పసముద్రం : ఈ-కేవైసీ నమోదుకు ఐదు రోజుల గడువు పొడిగించినట్లు ఏవో ప్రేమలత గురువారం పేర్కొన్నారు. పీఎం కిసాన్ మంజూరు సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలంటే ఈ-కేవైసీ నమోదు చేసుకోవాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. మండలంలోని రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయక అధికారితో సంప్రదించి కేవైసీ సరి చూసుకోవాలని సూచించారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు

మదనపల్లె : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు అన్నారు. గురువారం కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో సచివాలయంలో గృహ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం గోడలు, మోల్డింగ్ దశల్లో ఉన్న అన్ని ఇళ్లు మార్చి 22, ఉగాదిలోపు పనులన్నీ పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలన్నారు. లబ్ధిదారులకు ఏవేని ఆర్థిక ఇబ్బందులుంటే, వెలుగు మండల మహిళా సమాఖ్య నుంచి సచివాలయ సిబ్బంది సహకారంతో రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1,018 ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని, 900 ఇళ్లు శ్లాబ్, గోడల దశలో ఉన్నాయన్నారు. వీటన్నంటిపై లబ్ధిదారులను చైతన్య పరిచి మండలంలో ఉగాది నాటికి 2,000 ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుశీల, వెలుగు ఏపీఎం సుబ్రహ్మణ్యం, సచివాలయ సెక్రటరీ బాబా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె : సుదీర్ఘ పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా మరోసారి రాష్ట్ర ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ తెలిపారు. గురువారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణలో భాగంగా జరిగే దీక్షలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కుపరిశ్రమను ప్రైవేట్‌పరం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాదాపు 700 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి పేరుతో ఆందోళనలు జరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి తీరుతామని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్ద ఈ నెల 23న జరిగే నిరసన దీక్షలో కార్మికులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి దేవా, శోభ, నాగరాజు, గోపాల్, నరసింహులు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా పశువుల పండుగ



కలికిరి : చిట్లాకుప్ప చుట్టూ పశువులను ప్రదర్శనగా తీసుకెళ్తున్న రైతులు

కలికిరి : మండల పరిధిలో పలు గ్రామాలలో ప్రజలు పశువుల పండుగను సంబరంగా జరుపుకొన్నారు. సంప్రదాయం ప్రకారం మండలంలోని కొన్ని గ్రామాలలో సంక్రాంతి తరువాతి గురువారం రోజు పశువుల పండుగ నిర్వహించారు. కలికిరి పట్టణంలోని టిబి రోడ్డు, ఆర్ఎస్‌రోడ్డు, చుట్టు పక్కల పలు గ్రామాల ప్రజలు కలికిరి సమీపంలోని పెద్ద చెరువు మొరవ వద్ద పశువుల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. పశువులను అలంకరించి చిట్లాకుప్ప వద్దకు తరలించారు.

సుఖసంతోషాలతో ఉండాలి

వాల్మీకిపురం: నియోజకవర్గంలో రైతులు ఈ ఏడాది పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని గురువారం మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, ప్యారంపల్లి, గొళ్లపల్లి, ఆరమడక, ఫత్తేపురం, జర్రావారిపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సాయిబాబా నగర్, ఫింగాణీ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చిట్లాకుప్పలు వద్ద కాటమరాజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సాయిబాబానగర్‌లోని చిట్లాకుప్ప వద్ద కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఇంటిని క్రమబద్ధీకరించండి



ఇంటి కొలతలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో రంగస్వామి

పీలేరు : పీలేరు పంచాయతీలోని ప్రతి ఇంటిని క్రమబద్ధీకరించుకోవాలని ఆర్‌డీవో రంగస్వామి అన్నారు. గురువారం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పీలేరు టౌన్‌లో తమ ఇళ్లను క్రమబద్ధీకరించాలని అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి విజ్ఞప్తి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తుదారుల ఇంటిని క్రమబద్ధీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి, కొలతలు తీసి, కొలతల ప్రకారం ఇంటి నెంబరు కేటాయించి, క్రమబద్ధీకరణలో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఇంటిని మాత్రం అనుమతిలోకి తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఇంటిని క్రమబద్ధీకరించి, నివేదికలు సమర్పించడం జరుగుతుందని, అనంతరం కేటాయించిన ఇళ్లకు మాత్రమే డోర్ నంబర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పాత బస్టాండ్ వీధిలోని రెండు వీధుల్లో డోర్ నెంబర్, ఇంటి కొలతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వాల్మీకిపురం : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వాల్మీకిపురం సీఐ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తికి చెందిన కోటపల్లి అనసూయమ్మ, కోటపల్లి రెడ్డెప్పరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు కోటపల్లి సనోంద్రరెడ్డి ఆధ్వర్యంలో మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఏడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా లోకల్‌బాయ్స్ టీం రూ.10,116, రన్నర్స్‌గా డ్రీమ్ 11 జట్టు రూ.7,116 కైవసం చేసుకున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ సీరిస్‌గా దిలీప్‌రెడ్డికి వాల్మీకిపురం సీఐ సురేష్ రూ.2500 అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విక్రంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముబారక్, ప్రభు, యోగానందరెడ్డి, మురళి, ఖాదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



బాలుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న అధికారులు

తంబళ్లపల్లె: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల కోసం అమలు పరుస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీ తెలిపారు. గురువారం ఎద్దులవారిపల్లె, అన్నగారిపల్లెల్లో జరిగిన ఫామిలీ డాక్టర్ కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు. ఎద్దులవారిపల్లెలో హైడ్రోసిసిలస్ వ్యాధి బారిన పడిన చిన్నారి మహ్మద్‌అలీ పరిస్థితిపై ఆరా తీశారు. ఆ బాలుడి తల్లితో పరిస్థితి తెలుసుకుని 104 వాహన నిర్వహణ రికార్డులు పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణ రోజువారి నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ నిరంజన్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్ఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

తంబళ్లపల్లె : మండలంలోని కార్డుదారులకు చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూలు సకాలంలో, సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కళావతి ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌకదుకాణ డీలర్లు సరుకుల పంపిణీలో ఎండీయూలకు సహకరించాలన్నారు. ఎక్కడా అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు : నిత్యావసర సరుకులను ప్రజలకు సకాలంలో అందించాలని డీలర్లకు, ట్రక్కు నిర్వాహకులకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమీక్షించారు. సకాలంలో పంపిణీ చేయకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ వెంకట్‌రెడ్డి, వీఆర్‌ఓలు, డీలర్లు ఉన్నారు.